ప్రజాశక్తి
గురువారం 15 మే 2025 | 5 | అనంతపురం





లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

లోకేష్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

మూడు రోజుల పాటు జిల్లాలోనే మంత్రి




ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం నుంచి మూడు రోజుల పాటు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. 15, 16, 17వ తేదీల్లో ఆయన పర్యటన సాగనుంది. 15న సాయంత్రం రామరాజుపల్లిలో టిడిపి కార్యకర్తలతో సమావేశం కానున్నారు. 16న ఉదయం బేతపల్లిలోని రెన్యూ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం అనంతపురంలో జరిగే కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుమార్తె వివాహానికి హాజరుకానున్నారు. 17న ఉదయం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి కలిసి పాల్గొంటారు. గురువారం నాడు బేతపల్లిలో హెలిప్యాడ్, సభా వేదిక, రెన్యూ విండ్ ఎనర్జీ (జెఎవి) ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మంత్రి పర్యటనకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ ఓబులేసుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోకేష్ పర్యటనను విజయవంతం చేద్దాం : దగ్గుపాటి

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్న నారా లోకేష్ పర్యటను విజయవంతం చేద్దామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 16వ తేదీన నారా లోకేష్ నిర్వహించబోయే కార్యకర్తల సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్‌లతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, శాప్ ఛైర్మన్ రవి నాయుడు తో పాటు పలువురు టిడిపి కీలక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యకర్తలకు అండగా నిలిచేందుకు నారా లోకేష్ జిల్లా పర్యటనకు వస్తున్నారని చెప్పారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకూ టిడిపిలో గుర్తింపు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి స్టేట్ మీడియా కోఆర్డినేటర్ బివి.వెంకటరాముడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభ్యర్థి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, ఎడిసిసి బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు పాల్గొన్నారు.





రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలు పేద విద్యార్థులకు నష్టం చేకూర్చే విధంగా ఉండబోతున్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పునర్ వ్యవస్థీకరణతో విద్య వ్యవస్థ మొత్తం గందరగోళంలో పడే పరిస్థితులు నెలకొనబోతున్నట్లు విద్యావేత్తల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

అయోమయంలో పాఠశాల విద్య..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పాఠశాల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం మూడు జీవోలను జారీ చేసింది. వీటిని నిశితంగా గమనిస్తే ఇప్పుడున్న విధానం కాకుండా మార్పులతో అయోమయం కూడా నెలకొనే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఆరు రకాలుగానున్న దాన్ని తొమ్మిదికి పెంచామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా ఈ మార్పులతో ఉపాధ్యాయ పోస్టులను మిగులు చూపించే ప్రయత్నం సాగుతోందన్న విమర్శలూ ఉన్నాయి.

విద్యా వ్యవస్థలో మార్పులు ఇలా...

అంగన్‌వాడీ మొదటి రెండు సంవత్సరాలున్న పాఠశాలను శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ అని, అంగన్‌వాడీ రెండు సంవత్సరాలు 1, 2 తరగతులను ఫౌండేషన్ స్కూల్ అని పేరు పెట్టారు. అంగన్‌వాడీ రెండు సంవత్సరాలతోపాటు ఒకటి నుంచి ఐదవ తరగతి వరకుండే పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూల్ అని పేరు పెట్టారు. అంగన్‌వాడీ రెండు సంవత్సరాలతోపాటు ఐదవ తరగతి వరకు ఉంటూ 60 మంది కంటే విద్యార్థులు ఎక్కువ ఉంటే మోడల్ ప్రైమరీ స్కూల్ అని నామకరణం చేశారు. అంగన్‌వాడీ రెండు సంవత్సరాలు 1 నుంచి 8వ తరగతి వరకు ఉండే పాఠశాలను అప్పర్ ప్రైమరీ పాఠశాల అంటారు. ఆరు నుంచి పదవ తరగతి వరకుండే పాఠశాలలను



హైస్కూల్‌గా నామకరణం చేశారు. 1 నుంచి 10 వరకున్న పాఠశాలలు హైస్కూల్ అయినప్పటికీ సిబ్బంది కేటాయింపు వేరుగా ఉంటుంది. ఆ తరువాత 6 నుంచి 11, 12 తరగతులుంటాయి. వీటిని హైస్కూల్ ప్లస్ అంటారు. మరో దగ్గర 1 నుంచి 11, 12 తరగతుల వరకుండే వాటిని కూడా హైస్కూల్ ప్లస్ అనే అంటారు. మొత్తం తొమ్మిది రకాలుగా పాఠశాలల గుర్తించారు. వీటి ఆధారంగా ఉపాధ్యాయ నియామకాలు సర్దుబాటు చేయనున్నారు. ఈ సర్దుబాటుల్లో స్కూల్ అసిస్టెంట్లు మిగులు వస్తున్నారు. ఈ మిగులు వచ్చిన స్కూల్ అసిస్టెంట్లను ప్రైమైరీ స్కూల్ హెడ్‌మాస్టర్లుగా మార్చనున్నారు. ఈ మార్చడం వల్ల సబ్జెక్టు టీచర్లు ప్రాథమిక విద్యను బోధించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ రకంగా అనంతపురం జిల్లాలో 515 స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులుగా పోవాల్సి ఉంటోంది. ఇవిపోను మరో 437 మంది ఇప్పటి వరకు డిఇఒ పూల్‌లో ఉండగా వారిని రాష్ట్ర హెచ్ఒడి పూల్‌లో మారుస్తారు. అక్కడి వారి మార్గదర్శకాల ప్రకారం ఈ ఉపాధ్యాయులు వెళ్లి బోధన చేయాల్సి ఉంటుంది. 1 నుంచి 10 వరకు, 1 నుంచి 12వ తరగతి వరకు కూడా కొన్ని పాఠశాలలు పెడితే విద్యాబోధనలోనూ ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయాన్ని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు చెబుతున్నారు. కొత్త విధానంతో గందరగోళం, అయోమయం విద్యా వ్యవస్థలో నెలకొనడమే కాకుండా పేద విద్యార్థులకు నష్టం చేకూరే ఉండనుందని ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

- పునర్‌వ్యవస్థీకరణతో సమస్యలు
- పేదలకు దూరం కానున్న ప్రభుత్వ విద్య
- కొత్త నిబంధనలపై సర్వత్రా విమర్శలు

పునర్ వ్యవస్థీకరణతో అయోమయం

ప్రభుత్వం తీసుకొచ్చిన పాఠశాలల పునర్ వ్యవస్థీకరణతో విద్యా వ్యవస్థలో గందరగోళం నెలకొనే అవకాశముంది. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపులోనూ సమస్యలొచ్చే అవకాశముంది. అప్పర్ ప్రైమరీలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉంటే స్కూల్ అసిస్టెంట్లను నలుగురినే నియమిస్తారు. అప్పుడు రెండు సబ్జెక్టులకు విద్యను ఎవరు బోధిస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ప్లస్2ను కలిపి స్కూల్ అసిస్టెంట్లుగానున్న వారిని బోధించమని చెబుతున్నారు. వారు రెగ్యులర్ కాకపోవడం వల్ల ఏ మేరకు విద్యార్థులకు సరైన విద్య అందుతుందన్నది కూడా ప్రశ్నార్థకంగానే ఉంది. ప్రభుత్వం ఈ నిర్ణయాలను పనర్ పరిశీలిస్తే బాగుంటుంది.

రమణయ్య, యుటిఎఫ్ జిల్లా నాయకులు.

పేద విద్యార్థులకు నష్టం

పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ వల్ల పేద విద్యార్థులకు తీరని నష్టం జరిగే అవకాశం కనిపిస్తోంది. తక్కువ విద్యార్థులున్నారని కొన్నింటిని విలీనం చేస్తున్నారు. ముందున్న పాఠశాలలు ఇప్పుడు విలీనం చేయబోయే పాఠశాలలకు మధ్య దూరం ఎక్కువగా ఉంటోంది. దీని వలన ప్రాథమిక విద్య అభ్యసించే వారికి ఇబ్బందులు తప్పవు. క్రమంగా విద్యకు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకటి నుంచి 12 వరకు కూడా కొన్నింటిని కలిపి ఉంచే ఆలోచన ఉంది. అలా చేస్తే అంతమంది విద్యార్థులు ఒకచోట అవడంతోనూ విద్య బోధనలోనూ గందరగోళం నెలకొనే అవకాశముంది.

పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

వేరుశనగ విత్తన పంపిణీకి సిద్ధం కండి

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వచ్చే ఖరీఫ్ నేపథ్యంలో వేరుశనగ విత్తన పంపిణీకి అన్ని విధాలా సిద్ధం కావాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రైమరీ సెక్టర్‌పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ - 2025లో 50,592 క్వింటాళ్ల విత్తన వేరుశనగను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కిసాన్ డ్రోన్లకు సంబంధించి లక్ష్యం మేరకు ఇంకా గ్రూపులను ఎంపిక చేయాలన్నారు. అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం త్వరగా అందించేలా చూడాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలవ ఇరువైపుల రైతులు ఉద్యాన పంటలు సాగుచేసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, హార్టికల్చర్ డిడి రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్ ఖాన్, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, డిసిఒ అరుణకుమారి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, ఏడీ రాకేష్ పాల్గొన్నారు.

'పెద్దారెడ్డీ.. నీ పొలంలో అడుగు పెట్టారు చూడు'..!

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

'తన పొలంలోకి ఎవరైనా వస్తే ఈడ్చికుపోయి తంతానంటూ ఘాటు విమర్శలకు పాల్పడ్డావు.. నేడు మీ పొలంలో అడుగు పెట్టి.. హద్దులు గుర్తించారు.. ఇప్పుడు నువ్వేం చేస్తాం' అంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ప్రశ్నించారు. బుధవారం తాడిపత్రిలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెసి మాట్లాడారు. సోలార్ కంపెనీలు వస్తే ఉపాధి దొరుకుతుందని ఆ రోజుల్లో రైతులు పొలాలు ఇచ్చారన్నారు. ఆ పొలాలను పెద్దారెడ్డి వశపరచుకొని మరింత భూమిని ఆక్రమించారని తెలిపారు. ఈ విషయమై నాడు ఫిర్యాదు చేస్తే తనపై తప్పుడు విమర్శలు చేశారని గుర్తు చేశారు. తన పొలంలో అడుగుపెడితే ఈడ్చుకెళ్తానన్న పెద్దారెడ్డి ఇప్పుడెక్కడున్నాడని ప్రశ్నించారు. తాము అంతా న్యాయబద్ధంగానే వెళ్తున్నామని తెలియజేశారు. అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పెద్దారెడ్డి ఊరు విడిచి సంవత్సరం గడిచిందని దీనిని ప్రజలు పండగలా చేసుకుంటున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే రావాలని ప్రయత్నించినా ఊరు ప్రజలే రానివ్వరని తెలిపారు. పెద్దారెడ్డి లాంటి వారిని చేరదీయొద్దంటూ వైఎస్.జగన్‌కు హితవు పలికారు.

విపత్తులపై అప్రమత్తత అవసరం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

అనుకోని విపత్తు సంభవిస్తే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రాజహంస అపార్ట్‌మెంట్‌లో జిల్లా అగ్నిమాపక, ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరూ అధైర్య పడకుండా దానికి ఎలా రక్షించుకోవాలి అన్న దానిపై దృష్టి సారించాలన్నారు. మాక్‌డ్రిల్ ద్వారా తెలియజేసిన అంశాలను ప్రమాదాలు జరిగిన సమయంలో ఉపయోగించుకుని సురక్షితంగా బయట పడాలని తెలియజేశారు. అనంతరం మాక్ డ్రిల్‌పై పిల్లలు, యువకులకు అవగాహన నిమిత్తం క్విజ్ పోటీలను నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎ.మాలోల, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో కేశవనాయుడు, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



గదిలో చిందర వందరగా ఉన్న రికార్డులు

చిందరవందరగా రెవెన్యూ రికార్డులు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం రికార్డుల్లో పలు రికార్డులు చిందర వందరగా కన్పిస్తున్నాయి. ఆ గది మొత్తం పేపర్ల చెత్తదిబ్బలా దర్శనమిస్తుంది. ఇటీవల ఆర్డీవో కేశవనాయుడు తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో రికార్డులను క్రమ పద్ధతిలో ఉంచుకోవాలని తెలియ జేశారు. అయితే ఆర్డీవో ఆదేశాలు నేటికీ అమలు కాలేదు. ఇప్పటికీ రికార్డు గదిలో దస్త్రాలు అన్నీ చిందరవందరగానే దర్శనమిస్తున్నాయి. అడంగల్, డైక్‌లాక్ పుస్తకాలకు చెదలు పడుతున్నట్లు తెలుస్తోంది. అత్యంత ప్రాధాన్యత కలిగిన పుస్తకాలను అశ్రద్ధతో ఇలా వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. యల్లనూరుకు రెగ్యులర్ తహశీల్దార్ లేక కార్యాలయం పర్యవేక్షణను పట్టించుకునే వారు కరువయ్యారు. రీ సర్వే అనంతరం రైతుల పరిస్థితి చాలా దుర్భరంగా మారింది. రీ సర్వే తర్వాత చాలా మంది భూ రికార్డులు ఆన్‌లైన్‌లో కన్పించడం లేదు. క్రాప్ లోన్ రుణాల రెన్యువల్ సమయం కావడంతో 1బి రాక చాలా మంది రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో సంబంధిత రైతులకు సంబంధించిన పుస్తకాలను రికార్డు గదిలో వెతకడం కష్టం అవుతోంది. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి రికార్డు గదిలో ప్రాధాన్యత కలిగిన పుస్తకాలు అన్నింటినీ క్రమ పద్ధతిలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శ్రీ రామ రూరల్ సైనిక్ స్కూల్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ రామ రూరల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో చిలుమూరులో ఏర్పాటు చేసిన సైనిక్ స్కూల్ బ్రోచర్‌ను విడుదల చేశారు. బుధవారం నాడు అనంతపురం కమలానగర్‌లోని అపుస్మా కార్యాలయంలో అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు, శ్రీరామ రూరల్ సైనిక్ స్కూల్ అధ్యక్షులు కొలసాని తులసీ విష్ణు ప్రసాద్, స్టేట్ కోఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డితో కలిసి వీటిని ఆవిష్కరించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికి రెండు సైనిక్ స్కూల్స్ ఉన్నాయని, మూడోది ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో సైనిక స్కూల్‌ను గుంటూరు జిల్లా కొల్లూరు మండలం చిలుమూరులో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 2025-26 విద్యాసంవత్సరంలో ప్రతిభావంతులైన విద్యార్థులు శ్రీరామ సైనిక్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉందన్నారు. శ్రీరామ సైనిక్ స్కూల్ విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించి, పోటీ ప్రపంచంలో తల్లి దండ్రులు ఆశయా లకు అనుగుణంగా తీర్చి దిద్దుతామని వారు తెలియజేశారు.



బ్రోచర్స్‌ను విడుదల చేస్తున్న అపుస్మా నాయకులు

స్నాతకోత్సవాన్ని పండుగలా నిర్వహిద్దాం

జెఎన్‌టియు వైస్-ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వాహిద్దామని జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు తెలియజేశారు. స్నాతకోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం నాడు జెఎన్‌టియు ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో యూనివర్సిటీలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ 17వ తేదీన నిర్వహించే స్నాతకోత్సవ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. డాక్టర్ సత్యనారాయణ చావాకు వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాన్పూర్ ఐఐటి రిటైర్డ్ ఆచార్యులు ఎంఆర్.మాధవ్ హాజరవుతారన్నారు. స్నాతకోత్సవం నిర్వహణకు సంబంధించి ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. వారి పరిధిలోని పనులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో నిర్వహించాలని తెలియజేశారు. విద్యార్థులు 17వ తేదీ ఉదయం 9.30 గంటలలోపు ఎన్‌టిఆర్ ఆడిటోరియానికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య, ఓఎస్‌డి టు వీసీ ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, ఎస్‌వి.సత్యనారాయణ, వైశాలి ఘోర్పడే, పి.సుజాత, జి.ప్రశాంతి, పద్మ సువర్ణ, ఆర్.కిరణ్మయి, నాగ ప్రసాద్ నాయుడు, ఎ.సురేష్ బాబు, బి.ఈశ్వర్ రెడ్డి, విబి.చిత్ర, సి.శోభా బిందు, జివి.సుబ్బారెడ్డి, ఎపి.శివ కుమార్, ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, చంద్ర మోహన్ రెడ్డి, కోఆర్డినేటర్స్ డా॥అరుణ మస్తాని పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి సుదర్శనరావు

ఎలక్ట్రిసిటీ హమాలీల పొట్టకొట్టొద్దు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్



హమాలీలతో కలిసి దీక్షల్లో పాల్గొన్న నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ట్రాన్స్‌ఫార్మర్ లోడింగ్, అన్ లోడింగ్ పనులను ప్రయివేటు సంస్థలకు అప్పగించి హమాలీల పొట్ట కొట్టొద్దని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ తెలియజేశారు. అనంతపురం ఎలక్ట్రిసిటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ లోడింగ్, అన్ లోడింగ్ పనులు హమాలీ సొసైటీకి కేటాయించాలని కోరుతూ హమాలీలు చేస్తున్న ఆందోళన బుధవారం 10వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని నాగేంద్ర కుమార్ సందర్శించి హమాలీలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల లోడింగ్, అన్‌లోడింగ్ పనులను ప్రయివేటు కాంట్రాక్టుకు కాకుండా హమాలీ సొసైటీకే ఇవ్వాలన్నారు. 14 సంవత్సరాలుగా అమలు జరుగుతున్న విధానాన్ని మార్చడం సరికాదన్నారు. ప్రయివేటు కాంట్రాక్టర్లు వస్తే హమాలీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు కార్మికుల పొట్ట కొట్టకుండా హమాలీ సొసైటీకి టెండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌ఫార్మర్ హమాలీ యూనియన్ నాయకులు హాజీవలీ, షామీర్ బాషా, గంగాధర్, రామాంజనేయులు, చెన్నకేశవులు, మున్ని, అశోక్, రాజు పాల్గొన్నారు.

ఉపాధి మస్టర్ల తనిఖీ

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, ఈసి సత్యమూర్తి బుధవారం పరిశీలించారు. సింగవరం, కల్లూరు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ కూలీలను మస్టర్లను తనిఖీ చేశారు. మస్టర్ల ప్రతి రోజు పని ప్రదేశనికి తెచ్చుకోవాలన్నారు. పనులు నిర్వహణ, బిల్లుల చెల్లింపులో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం : కమిషనర్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధమని, వినియోగిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి హెచ్చరించారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై బుధవారం కమిషనర్ ఛాంబర్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, అమ్మకాలు, వాడకాన్ని పూర్తిగా నిషేధించామన్నారు. ఈ విషయంపై నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్లాస్టిక్ షాపుల యజమానులకు ఈ నెల 1వ తేదీ నోటీసు జారీ చేశామన్నారు. అవగాహన సదస్సు కూడా నిర్వహించామన్నారు. కావున షాపుల యజమానులు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని, లేనిచో నగరపాలక సంస్థ సిబ్బంది తనిఖీలు చేసి పట్టుబడితే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో ప్రతిరోజూ ఇంటింటా చెత్త సేకరించాలని, దుకాణదారులు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరంలోని హౌసింగ్ బోర్డ్‌లో సెవెన్ హిల్స్ కాలనీ వద్ద బుధవారం ఉదయం కలెక్టర్ ఇంటింటి చెత్త సేకరణను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తున్నారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమలుపై పబ్లిక్ నోటీస్ ఇవ్వాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే దుకాణదారులకు నోటీసులు ఇచ్చి వారి


పారిశుధ్యం పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నుంచి జరిమానా వసూలు చేయాలన్నారు. ప్రతి దుకాణం వద్ద తడి చెత్త, పొడి చెత్తకు వేర్వేరుగా డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని పబ్లిక్ నోటీసులు ఇవ్వాలన్నారు. డ్రెయినేజీ లేదని స్థానికుడు మహమ్మద్ ముస్తఫా తెలుపగా డ్రెయిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్‌ను సూచించారు. అనంతరం రామ్ నరేష్ ఫంక్షన్ హాల్ వద్ద డ్రెయినేజీని పరిశీలించి వెంటనే శుభ్రం చేసి ఫొటోలు పంపించాలన్నారు. నగరంలోని గార్బేజ్ వల్లరబుల్ పాయింట్ల వద్ద శుభ్రం చేసి ప్లాంటేషన్ చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ చంద్రశేఖర్, ఎంహెచ్ఓ నరసింహులు, ఈఈ షకీర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, సెక్రటరీ నరసింహమూర్తి ఉన్నారు.

17న పెన్నహోబిలేశుని బ్రహ్మ రథోత్సవం.. జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈ నెల 17వ తేదీ నిర్వహించే పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవాన్ని విజయవంతం చేద్దామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ తిప్పేనాయక్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం బ్రహ్మ రథోత్సవం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, తాత్కాలిక మరుగు దొడ్లు, ప్రత్యేక వైద్యశిబిరం, చలువ పందిళ్లు ఏర్పాటు చేయలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని, అగ్నిమాపకశాఖ అత్యవసర సర్వీసులు అందుబాటులో ఉంచాలని, ఆలయ పరిసరాల్లో మద్యం అమ్మకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులు, ఈఓ సాకే రమేష్‌బాబును ఆదేశించారు. సమావేశంలో ఆర్టీసీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యు ఎస్, రెవెన్యూ, ఎంపీడీవో, వైద్య, అగ్నిమాపక, పోలీస్, దేవదాయ, ఐసిడిఎస్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు

పెన్నహోబిలంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం శ్రీవారిని హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. వాహనసేవకు ముందు స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను హనుమంత వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ


భక్తులకు హనుమద్ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు

సాకే రమేష్‌బాబు, అర్చకులు ద్వారకనాథ్‌స్వామి, బాలాజీస్వామి, ఉత్సవ దాతలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో జరుగుతున్న ఈవో సాకే రమేష్ బాబు, టిడిపి నాయకులు పరిశీలించారు. బ్రహ్మరథోత్సవం రోజున లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, అందుకు అనుగుణంగా తాగునీరు, చలువపందిళ్లు, క్యూలైన్లు, విద్యుత్ సరఫరా, షవర్ బాత్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఈవోకు సూచిం చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్, నాయకులు మోపిడి గోవిందు, ఎర్రిస్వామి, ఇంద్రావతి, వెంకటేశులు పాల్గొన్నారు.

బిఎన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలో జాతీయ రహదారి-44 పక్కన సర్వీసు రోడ్డులో డిమార్ట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిఎన్ ఎంటర్‌ప్రైజెస్‌ను బుధవారం మేనేజింగ్ పార్ట్‌నర్లు మదమంచి బోధన్‌చౌదరి, నాగరాజు లాంఛనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జీరో మెయింటెనెన్స్, నాణ్యమైన ఆధునిక హంగులతో రూపొందించిన 'ఆడమ్స్ ఈ బైక్స్'ను యువతకు ఆకర్షణీయమైన మోడల్స్‌లో అనంత పురం మార్కెట్లోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బిఎన్ ఎంటర్‌ప్రైజెస్ సీ అండ్ ఎఫ్ డిస్ట్రిబ్యూటర్‌గా ఉంటూ ప్రత్యేకంగా షోరూంను ప్రజలకు అందుబాటు లోకి తీసుకొచ్చిందన్నారు. 8 రకాల బైక్స్ ఉండగా అందులో 6 నాన్ రిజిస్ట్రేషన్, 2 రిజిస్ట్రేషన్ వెహికల్స్ ప్రత్యేకమైన డిజైన్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆడమ్స్ సంస్థ వికలాంగులకు త్రీ వీల్, టూ వీల్, లగేజీ వెహికల్స్‌ను కూడా


మొదటి వాహనాన్ని కొనుగోలు చేసిన కస్టమర్‌కు తాళం అందిస్తున్న నాగరాజు బోధన్‌చౌదరి

అందుబాటులో ఉంచిందన్నారు. ధర రూ. 72వేల నుంచి రూ. 1.6 లక్షల వరకూ ఉన్నాయన్నారు. మంచి మైలేజీ ఇస్తాయన్నారు. తమ సంస్థ శ్రీరామ్ బజాజ్ సంస్థలతో ఒప్పందం కలిగి ఉందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, పలువురు రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు హాజరయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1 నుంచి ప్లాస్టిక్ కవర్లు నిషేధం

ప్రజాశక్తి-పామిడి

పామిడి గ్రామపంచాయతీ పరిధిలో జూన్ 1వ తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధమని ఎంపీడీవో తేజోష్ణ స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై


ప్లాస్టిక్ నిషేధంపై మాట్లాడుతున్న ఎంపీడీవో తేజోష్ణ

బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ గోపాల్ ఆధ్వర్యంలో వ్యాపారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో ప్లాస్టిక్ వాడకం, నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు మురికి కాలువల్లో చేరి నీటి ప్రవాహానికి అడ్డుపడతాయన్నారు. తద్వారా వర్షాకాలంలో కాలనీలు జలమయమయ్యే అవకాశం ఉందన్నారు. పశువులు ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల చనిపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యాపారులు, షాపుల యజమానులు తమ వద్ద ఉన్న ప్లాస్టిక్‌ను ఈ నెలాఖరు లోపు వాడేయాలన్నారు. జూన్ 1వ తేదీ తర్వాత ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టిక్ కవర్లు వాడరాదని హెచ్చరించారు. ఎవరైనా అతిక్రమిస్తే జరిమానా విధిస్తామన్నారు. అలాగే ప్రతి షాపు యజమాని పొడి చెత్త, తడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేసి పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు ఆ వాహనాలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఖాజామొయిద్దీన్, పంచాయతీ సిబ్బంది, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈఈకు ఉద్యోగోన్నతి

అనంతపురం : ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) సతీష్‌చంద్రను అనంతపురం పబ్లిక్ హెల్త్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న ఆయనను 7 నెలల క్రితం నెల్లూరు జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే ఆయన భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన సెలవులో ఉన్నారు. ఇప్పుడు ఉద్యోగోన్నతిపై తిరిగి అనంతపురం పబ్లిక్ హెల్త్ డిప్యూటీ ఎస్ఈగా నియమితులయ్యారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అలివేలమ్మ

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

పుట్లూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో అలివేలమ్మ టిఏలకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఫారంపాండ్లు తవ్వాలని, రోజుకు కనీసం రూ. 300 కూలి వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంకుడు గుంతలు, కొత్తగా హార్టికల్చర్ జాబితా తయారు చేయాలన్నారు. పశువుల షెడ్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని టిఎలు, ఎఫ్ఎలు, బిఎఫ్‌టిలను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ నరేంద్ర, టిఎలు, ఎఫ్ఎలు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఉరవకొండ : మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు అమిలినేని అనిల్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని విటల్ రుక్మిణి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. తన తండ్రి అమిలినేని శ్రీనివాసులు 16 వర్ధంతి సందర్భంగా అమిలినేని అనిల్ తల్లి అమిలినేని ఓబులమ్మతో కలిసి వృద్ధులకు అన్నదానం చేశారు. తన తండ్రి జ్ఞాపకార్థం భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతానని అనిత్ తెలిపారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు ఎర్రిస్వామి, దాసరి అనిల్, రాంబాబు పాల్గొన్నారు.

మడ్డిపల్లెలో రాతి దూలం పోటీలు

పుట్లూరు : అంకాలమ్మ జాతర సందర్భంగా మండలంలోని మడ్డిపల్లె గ్రామంలో బుధవారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. విజేత ఎద్దుల యజమానులకు నిర్వాహకులు రూ. 50వేలు అందజేశారు. ఆ తర్వాత స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15వేలు, రూ. 12 వేలు, రూ. 10వేలు, రూ. 8వేలు, రూ. 5వేలు అందజేశారు. పోటీలకు తిలకించేందుకు వచ్చిన వారికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అనుమానిత ప్రాంతాల పరిశీలన

యాడికి : ఎంపీడీవో వీరరాజు బుధవారం సిబ్బందితో కలిసి పలు అనుమానిత ప్రాంతాలను పరిశీలించారు. మండలంలోని తిరునాంపల్లి ప్రధాన రహదారి పక్కన స్థలాలు, బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన ముళ్ల పొదల మధ్య ఉన్న కోనేరును పరిశీలించారు. ప్రధాన రహదారి బ్రిడ్జి కింద అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు సమాచారం అందిందని, అలాంటి వాటిని నివారించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ముళ్ల పొదలను తొలగించే పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీవో తెలిపారు ఆయన వెంట పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర, సచివాలయం-4 పంచాయితీ కార్యదర్శి రామ్‌సతీష్ ఉన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన

అనంతపురం : ప్రపంచ మెట్రాలజీ దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకొని బుధవారం జిల్లా బంగారు దుకాణాల అసోసియేషన్, లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో బంగారు వ్యాపారులు, సాధారణ ప్రజలు భాగస్వామ్యమయ్యారు. బంగారు కొనుగోలు విషయంలో జరుగుతున్న మోసాలు, వాటిపై చట్టపరమైన చర్యలు, వినియోగదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. సదస్సులో అధికారులు సుధాకర్, వైజి.శంకర్, ఎం.మహమ్మద్ గౌస్, పి.శ్రీనివాసులు, వినియోగదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై వెంకటరమణస్వామి

రాయదుర్గం : పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి హనుమద్ వాహనోత్సవం నిర్వహించారు. స్వామి వారిని హనుమంత వాహనంపై కొలువుదీర్చి కోటలోని వెంకటరమణ స్వామి ఆలయం నుంచి వినాయక కూడలి మీదుగా లక్ష్మీ బజార్ వరకూ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సుగాలి, వాల్మీకి, వడ్డెర, ముదిరాజు, దొమ్మర సంఘాల ప్రజలు పాల్గొన్నారు.

పుస్తకాలతో విజ్ఞానం

గుత్తి : పుస్తకాలను చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి పి.రమ సూచించారు. పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులు, విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయాన్ని సందర్శించి అందుబాటులో ఉన్న దినపత్రికలు, పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించుకోవా లన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో పుస్తకాలు చదివించడం, ఆటల పోటీలు, చిత్రలేఖనంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఆమె వెంట గ్రంథాలయ అధికారి హెచ్.రామాంజనేయులు, సిబ్బంది సిద్ధార్థ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న సంస్థ జిల్లా కార్యదర్శి రమ

రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని లింగదహాల్, కొలగానహళ్లి, కృష్ణాపురం, ఉద్దేహాల్, గౌనూరు, బండూరు, దేవగిరి గ్రామాల్లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని క్వింటాల్ రూ. 2200 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసింది. అధికారులు ధాన్యాన్ని లారీలోకి ఎత్తించి జిపిఎస్ చేసి పాసింగ్ చేయాలి. అయితే రెండు రోజుల నుంచి పాసింగ్ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో లారీలు రోడ్లపై, రైతులు కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. వరి ధాన్యం విక్రయించిన వారిలో కౌలు రైతులు, గుత్తకు భూమి తీసుకుని పంట సాగు చేసిన రైతులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వాహనాలను జిపిఎస్ పాస్ చేసి ఖాతాల్లోకి నగదు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.


ఉద్దేహాల్ సొసైటీ వద్ద వరి ధాన్యం లోడ్ చేసిన లారీలు

జిపిఎస్ చేసి లారీలను పంపించాలి

వరి ధాన్యాన్ని మంగళవారం లారీల్లో లోడ్ చేసి అదే రోజు రాత్రి ఉద్దేహాల్ సొసైటీ కార్యాలయం వద్దకు చేర్చామన్నారు. అయితే జిపిఎస్ అయ్యే దాకా వరి ధాన్యం, లారీలు రైతులదే బాధ్యత అని సొసైటీ సెక్రటరీ హనుమంతు తెలిపారని కౌలు రైతు ఉప్పర తిమ్మప్ప తెలిపాడు. రాత్రంతా లారీల వద్దే ఉన్నామని, ఇకనైనా జిపిఎస్ చేసి లారీలను పంపించాలని కోరాడు. ఏలంజి తిప్పారెడ్డి మాట్లాడుతూ తాను వంద బస్తాలు ఇచ్చానని, మరో నలుగురు రైతులు 250 బస్తాలు లోడ్ చేశారన్నారు. రాత్రి ఉద్దేహాల్ సొసైటీ వద్దకు లారీ వచ్చిందని, రాత్రంగా లారీ వద్దే ఉన్నామన్నారు.

కార్యకర్తలకు టిడిపి అండగా ఉంటుంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తాడిపత్రి

కార్యకర్తలు, వారి కుటుంబ సంక్షేమం కోసం టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి తెలిపారు. కార్యకర్త ఏదైనా ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి భరోసానిచ్చేలా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీమా కల్పించారన్నారు. మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన నడిపయ్య గారి నారాయణమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె టిడిపి సభ్యత్వం కలిగి ఉండడం వల్ల ఆమె కుమారుడు నడిపయ్యగారి వంశీ బ్యాంకు ఖాతాలో బీమా మొత్తం రూ. 5 లక్షలు జమ చేసినట్లు తెలిపారు. అలాగే నారా లోకేష్ ఆ కుటుంబానికి రాసిన లేఖ, బీమా కంపెనీ నుంచి ప్రీమియం వచ్చినట్లు తెలిపే పత్రాలను నారాయణమ్మ కుమారుడికి ఎమ్మెల్యే అందజేశారు. దీంతో వంశీ


బీమా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


నగరంలోని వైసిపి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, నాయకులు

వైసిపి కార్యాలయంలో సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి, రైతుల ఉచిత విద్యుత్ ఫైలుపై చేసిన తొలి సంతకానికి 21ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైసిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. నగరంలోని రెండో రోడ్డులో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఆలమూరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైఎస్ సిఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే రైతుల ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేసి వ్యవసాయం దండగ అన్న వారి నోళ్లు మూయించి వ్యవసాయం పండగ అని నిరూపించారన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు చరమగీతం పాడి రానున్న రోజుల్లో మరోమారు రాజన్న రాజ్యం రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గౌస్‌బేగ్, పెన్నోబిలేసు, సైఫుల్లా బేగ్, హుస్సేన్‌పీరా, చంద్రశేఖర్‌యాదవ్, వెంకటకృష్ణ, మల్లెల వేణుగోపాల్, దేవాంగం రామయ్య, అనిల్‌కుమార్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, ఆంజనేయులు, నారాయణరెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, సాధిక్, రియాజ్, జావీద్, నూర్, మంజునాథ్‌రెడ్డి, అశోక్‌కుమార్, రామ్మూర్తి పాల్గొన్నారు

మాజీ సర్పంచి మృతి


వసుంధరమ్మ(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం మేజర్ పంచాయతీ మాజీ సర్పంచి వసుంధరమ్మ బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఈమె టిడిపి మద్దతురాలిగా గెలిచి మేజర్ పంచాయతీలో ప్రజలకు విశేష సేవలు అందించారు. ప్రధానంగా పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు సీసీ రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచినట్లు బంధువులు తెలిపారు.

యాడికి వైద్యాధికారిగా సాయిసుమంత్‌రెడ్డి

ప్రజాశక్తి-యాడికి

స్థానిక పిహెచ్‌సిలో సాయి సుమంత్ రెడ్డి వైద్యాధికారిగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన సాయి సుమంత్‌రెడ్డి తిరుపతి శ్రీవేంకటేశ్వర రుయా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. ఆయన మొదటి ఉద్యోగంగా యాడికి పిహెచ్‌సిలో రెండో వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు.



22న కౌలు రైతు సదస్సు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఉరవకొండలో ఈ నెల 22వ తేదీ నిర్వహిస్తున్న కౌలు రైతు సదస్సు ను విజయవంతం చేయా లని జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షులు బాల రంగయ్య పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం కౌలు రైతు చట్టం అమలు చేయాలని, దేవాదాయ భూముల ను కౌలు రైతులు, పేద రైతులకు ఇవ్వాలన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రైతు భరోసాను కౌలు రైతులకు వర్తింపచేయాలన్నారు. కౌలు రైతు కార్డులతో పాటు ఎరువులు, క్రిమిసంహార మందులు, విత్తనాలు అందించాలన్నారు. మండలంలో సుమారు 15 వేల మంది కౌలు రైతులు ఉంటే కేవలం 250 మందికి మాత్రమే కౌలు కార్డులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించి కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని, లేనిచో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడి స్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు రంగారెడ్డి, ఓబులేసు, శ్రీనివాసులు, వన్నూరుస్వామి ఉన్నారు.

'ఆ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి'

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్, షూ, టై, తదితర వస్తువులను పాఠశాలలోనే విక్రయిస్తూ అక్రమ సంపాదనే ధ్యేయంగా పాఠశాలలు నడుపు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి నిబంధనలు అతిక్రమించిన విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిచో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంఇఒ ఈశ్వరప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎ కన్వీనర్ భీమేష్, పిఎస్‌యు జిల్లా కార్యదర్శి భాస్కర్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, పిఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'అనంతలక్ష్మి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

సీబీయస్ఈ పదో తరగతి ఫలితాలోల నగర శివారులోని ఇటుకలపల్లి సమీపంలో ఉన్న అనంతలక్ష్మి పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 500 మార్కులకు గానూ గురుశాన్వి-489, లవకుమార్-466, ముని తశ్విక-463, ఎల్‌జి.ఆంచల్-453, కె.సంజన-453, సివి.సుశాంత్-448 మార్కులు సాధించారు. పాఠశాల ఛైర్మన్ అనంతరాముడు మాట్లాడుతూ అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. సరైన విద్యా ప్రణాళికలు అమలు చేయడం వల్లనే అద్భుత ఫలితాలు సాధించామన్నారు. విద్యార్థులు భవిష్యత్తు లో ఉన్నత


విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ఛైర్మన్ రాముడు

శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞ తలు తెలిపారు. విద్యార్థులను సీఏఓ నరసింహా రావు, హెచ్‌ఎం శాలిని, ఉపాధ్యాయులు అభినందించారు.

వికలాంగుల చట్టాలను అమలు చేయండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

వికలాంగుల హక్కుల చట్టం-2016ను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో పక్కాగా అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ జిల్లా అధ్యక్షులు వసంత్‌కుమార్, కార్యదర్శి రామయ్య, రాజేష్, నాగరాజు, ఖాజా, రాము పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వికలాంగుల హక్కుల చట్టం-2016 ను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఉపాధి పనుల్లో వికలాంగులకు సులువైన పనులు కల్పించడంతో పాటు పరికరాలు, పరిహారం అందజేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. బ్యాక్‌లాగ్


సమావేశమైన వికలాంగుల హక్కుల జాతీయ వేదిక పట్టణ కమిటీ సభ్యులు

పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ప్రతి పట్టణంలో ఇళ్ల స్థలాలు, రేషన్ అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని కోరారు. దేశ రక్షణలో ప్రాణాలర్పించిన అగ్నివీర్ జవాను మురళీనాయక్, పట్టణ దివ్యాంగ సభ్యుడు శ్రీరామ్ ఆత్మకు శాంతి కలగాలని కాంక్షిస్తూ 2 నిమిషాలు మౌనం పాటించారు.

బోధకాల వ్యాధి నిర్ధారణకు రక్తపూతల సేకరణ

ప్రజాశక్తి-శింగనమల

తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో శింగనమలలో మంగళవారం రాత్రి వైద్య సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి బోధకాల వ్యాధి రక్త నిర్ధారణ పరీక్షలు చేశారు. ముందస్తు చర్యలో భాగంగా వివిధ కాలనీల్లో పర్యటించి ప్రజల నుంచి రక్తపూతలు సేకరించి తరిమెల పిహెచ్‌సి ల్యాబ్‌కు పంపారు. వైద్యాధికారి మాట్లాడుతూ బోధకాల వ్యాధికి సంబంధించిన పరాన్నజీవి రాత్రిపూట మాత్రమే మనిషి శరీరంలోని ఉపరితల రక్త ప్రవాహంలో సంచరిస్తుంటాయన్నారు. కావున రాత్రిపూట మాత్రమే రక్తపూతలు సేకరించామన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్వైజర్ సిబ్బంది నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, సిహెచ్ఓ గంగాధర్, సూపర్వైజర్ అశ్వర్థనారాయణ, సచివాలయ ఎఎన్ఎంలు శైలజ, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, ఆశాబి, పద్మావతి, జయమ్మ, ప్రమీలమ్మ, రామాంజనమ్మ, హేమలత, ఆరోగ్య కార్యకర్తలు నాగరాజు, గీత, భారతి, మోహనమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుకు సన్మానం

ప్రజాశక్తి-శింగనమల

ఇంటర్నేషనల్ నర్స్ డే సందర్భంగా స్థానిక పిహెచ్‌సిలో బుధవారం వైద్యాధికారి రోహినాథ్ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్స్ వహీదాబిను సిబ్బంది సన్మానించారు. డాక్టర్ రోహినాథ్ మాట్లాడుతూ వహీదాబి రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించిందని కొనియాడారు. అనంతరం ఆమెకు జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హంద్రీనీవా జలాలతో చెరువులు నింపాలి

గుత్తి : హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి జిల్లాలోని చెరువులను నీటితో నింపాలని వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రజాపురం గ్రామంలో బుధవారం ఐటి విభాగం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు పట్టణంలో రోజూ తాగునీరు సరఫరా చేయాలని, బస్టాండ్‌ను అభివృద్ధి చేసి బస్సుల సంఖ్యను పెంచాలని, డిపో మేనేజర్‌ను నియమించాలన్నారు. ఆసుపత్రిని అభివృద్ధి చేసి, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. గుత్తి కోట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. గుత్తి మీదుగా వెళ్లే రైళ్లను గుత్తి స్టేషన్లో ఆపాలన్నారు. లేనిచో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, కొండయ్య, నరేష్ పాల్గొన్నారు.

మహిళపై హోంగార్డు దాడి

పుట్లూరు : ఓ మహిళపై హోంగార్డు దాడి చేసిన సంఘటన బుధవారం మండలంలోని కడవకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. కడవకల్లు గ్రామానికి చెందిన తనూజ ఇంటి ముందు దుస్తులు శుభ్రం చేస్తుండగా ఇంటి పక్కన ఉన్న హోంగార్డు రాజశేఖర్ ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె పట్ల అసభ్య ప్రవర్తించడంతో పాటు దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. దాడి చేసిన హోంగార్డు రాజశేఖర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తనూజ తెలిపారు.

చౌక బియ్యం పట్టివేత.. ఇద్దరిపై కేసు నమోదు

బొమ్మనహాల్ : రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు బుధవారం మండలంలోని గోవింద వాడ క్రాస్ రోడ్డులో బండూరు హెచ్ఎల్‌సి కెనాల్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కర్నాటకలోని చెల్లికెర గ్రామానికి అక్రమంగా రవాణా తరలిస్తున్న 28క్వింటాళ్ల(48 బ్యాగులు) చౌక బియ్యంతో పాటు బొలెరో పికప్ వాహనాన్ని సీజ్ చేసి రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పి.లక్ష్మీకాంత్ నాయక్‌కు అప్పజెప్పారు. అలాగే వాహన డ్రైవర్ బళ్లారికి చెందిన హరిజన లక్ష్మణ్, వాహన యజమాని, బియ్యం వ్యాపారి దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన గూని ఎల్లప్పపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో సిఐ కె.శ్రీనివాసులు, డిసిటిఒ బి.సురేష్‌కుమార్, సిఎస్‌డిటి పి.లక్ష్మీకాంత్‌నాయక్ పాల్గొన్నారు.

రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని మృతదేహం

గుత్తి : గుత్తి జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడిరాయి గ్రామ సమీపంలో రైలు పట్టాల పక్కన కాలువలో బుధవారం ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఘటనా స్థలాన్ని జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రిటైర్డ్ డిఇఒ ఆనందమూర్తి కన్నుమూత

అనంతపురం : రిటైర్డ్ డిఇఒ ఎస్.ఆనందమూర్తి(75) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఈయన శెట్టూరు మండలంలోని ములకలేడు గ్రామంలో 1949లో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించారు. ఉన్నత విద్యనభ్యసించిన ఆయన ఉద్యోగరీత్యా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా, జడ్పీ సిఇఒగా, జిల్లా విద్యాశాఖ అధికారిగా అనంతపురం జిల్లాలో పని చేసి చివరగా విజయనగరం జిల్లాలో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన అంత్యక్రియలు గురువారం ములకలేడు గ్రామంలో నిర్వహిస్తామని కుమారులు మల్లికార్జున, బాలు, వివేక్ తెలిపారు.

